ఒకే రోజు పది విమానాల రద్దు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయంలో ఒకే రోజు 10 విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నగరానికి రావాల్సిన ఐదు విమానాలు, బయల్దేరాల్సిన ఐదు విమానాలు మొత్తం 10 సర్వీసులు రద్దయినట్లు అధికారులు ప్రకటించారు. కోల్‌కొతా, భువనేశ్వర్, బెంగళూరు, తిరువనంతపురం, సిలిగురి తదితర నగరాల నుంచి చెన్నై రావాల్సిన విమానాలు, చెన్నై నుంచి ఆ నగరాలకు వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి. ఎలాం టి ముందస్తు ప్రకటన లేకుండా విమానాలు రద్దుకావడంతో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు తగినంత మంది లేకపోవడంతో విమానాలు రద్దుచేసినట్లు వారు ఆరోపిస్తున్నారు.

చెన్నైలో తెలుగు భవనం

● పవన్ కల్యాణ్‌కు 'తెలుగు పీపుల్ ఫౌండేషన్' వినతి

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో 'తెలుగు భవనం' నిర్మాణం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ విజ్ఞప్తి చేసింది. మంగళగిరిలో పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు దేవరకొండ రాజు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం.. తమిళనాడులోని తెలుగువారి స్థితిగతులను వివరించింది. చెన్నై, కోయంబత్తూరు, కాంచీపురం, మదురై, చెంగల్పట్టు, తిరువళ్లూరు, తిరుత్తణి, కృష్ణగిరి ప్రాంతాల్లో తెలుగువారు అధికంగా వున్నారని, వివిధ రంగాల్లో వారు స్థిరపడ్డారని వివరించింది. జయలలిత ముఖ్యమంత్రిగా వున్న సమయంలో చెన్నైలో తెలుగు భవనం నిర్మాణానికి అంగీకరించారని, అయితే కాలక్రమంలో ఆ ప్రాజెక్టు ముందుకు కదల్లేదని వారు వెల్లడించారు. ఇప్పుడైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెన్నైలో తెలుగు భవన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఫౌండేషన్ తరపున చేస్తున్న సామాజిక సేవలను, తెలుగు భాష, సంస్కృతుల కోసం చేస్తున్న కృషిని ప్రతినిధుల బృందం వివరించగా, ఉపముఖ్యమంత్రి అభినందించారు. ఈ భేటీలో దేవరకొండ రాజుతో పాటు ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, ఏఎం.మనోజ్, ప్రియా శ్రీధర్, బి.రఘునాథ్ తదితరులున్నారు.



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ఫౌండేషన్ నేతలు



ఓ మహిళకు ఆర్థికసాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఆయనకు ప్రజా సంక్షేమమే పట్టదు

అరియలూరు సభలో ఈపీఎస్‌పై సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్ల పాటు కొనసాగిన అన్నాడీఎంకే పాలనలో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ముఖ్యంగా ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రం మరింత అధ్వాన్నంగా తయారైందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. శుక్రవారం అరియలూరు జిల్లాలో పూర్తయిన 51 పథకాలను ప్రారంభించి 26 కొత్త పథకాలకు శంకుస్థాపన, అదే విధంగా పెరంబలూరు జిల్లాలో 456 పథకాలను ప్రారంభించి 27 కొత్త పథకాలకు శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నాడీఎంకే పాలనలో పథకాల పేర్లను తెలిపి, భారీగా నిధులు కేటాయించినట్లు ప్రకటించి ప్రజలను మోసగిస్తూ వచ్చారని, ప్రకటించిన పథకాలు అమలు జరిగిందా లేదా అని కూడా పరిశీలించలేదని ఆరోపించారు. ఈపీఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్నాడీఎంకే పాలన ఎప్పుడు ముగుస్తుందా అని రాష్ట్ర ప్రజలంతా ఎదురుచూశారన్నారు. ఎన్నో వేల సంవత్సరాల క్రితం సముద్రప్రాంతంగా ఉంటూ ఆది మానవులు ఆవిర్భవించిన అరుదైన ఊరుగా అరియలూరు పేరుపొందిందని, ఆ జిల్లాలోని కళ్లకుర్చిలో డైనోసార్ గుడ్లు లభించడం ప్రాచీన నాగరికతకు నిదర్శనమని, ఇక పూర్వంలో పులుల సంచారం అధికంగా ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంగా ఉన్న 'పెరుంపులియూరు' ప్రస్తుతం పెరంబలూరుగా పేరుపొందిందని, ఇంతటి చారిత్రక ప్రాశస్త్యం పొందిన రెండు జిల్లాల్లో కొత్త పథకాలు ప్రారంభించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవి చేపట్టాక మహిళల వెలుగుబాట పయనం పథకం అమలుకు సంబంధించిన ఫైలుపైనే తొలి సంతకం చేశానని, ఆ పథకం ద్వారా మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి ఆర్థిక పరంగా అభివృద్ధి చెందుతున్నారని స్టాలిన్ చెప్పారు. మూడేళ్ల క్రితం పండుగలకు స్వస్థలాలకు వెళ్లేందుకే చాలినంత బస్సులు ఉండేవి కావని, డీఎంకే అధికారంలోకి వచ్చాక పండుగ సీజన్ బస్సుల సంఖ్య విపరీతంగా పెంచామని, దీనికంతటికి రవాణాశాఖ మంత్రి శివశంకర్ చొరవే కారణమని ప్రశంసించారు. అరియలూరు జిల్లాగా ఆవిర్భవించడానికి మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కారణమని స్టాలిన్ అన్నారు. అరియలూరు జిల్లా వాసుల అభివృద్ధి కోసం డీన్ షూస్ పాదరక్షల కర్మాగారానికి శంకుస్థాపన చేశానని తెలిపారు డీఎంకే మిత్రపక్షమైన డీపీఐ నాయకుడు తిరుమావళవన్, అరియలూరు న్యాయవాదుల సంఘం ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తూ అరియలూరు జిల్లాలోని అన్ని న్యాయస్థానాలు ఒకే చోట ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారని, వెంటనే అధికారులతో చర్చించి రూ.101.50 కోట్లతో కోర్టుభవనాల కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు ప్రకటించినట్లు తెలిపారు. శాసనసభలో, బహిరంగ సభల్లో తాను ప్రకటించిన పథకాలు సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని పరిశీలించేందుకే తాను జిల్లాలవారీ పర్యటన చేస్తున్నానన్నారు. తన పైనా, డీఎంకే ప్రభుత్వంపైనా ప్రజలలో రోజు రోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేత ఈపీఎస్ రోజుకో అబద్ధంతో డీఎంకే పాలనపై పసలేని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఈపీఎస్ ముఖ్యమంత్రిగా నాలుగేళ్లపాటు ప్రజలకు సుపరిపాలనను అందించినట్లు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

కరుణ విగ్రహం ఆవిష్కరణ..

ఈ కార్యక్రమానికి ముందు అరియలూరు జిల్లా జయంకొండం వద్ద డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, శివశంకర్, కోవి చెళియన్, ఎంపీలు ఎ. రాజా, తిరుమావళవన్, శాసనసభ్యుడు కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

బలపడుతున్న ఈశాన్య రుతుపవనాలు

● 21 జిల్లాలకు అలెర్ట్ ● మూడు జిల్లాల్లో కుండపోత వర్షం



భవానీ సాగర్ లోతట్టు ప్రాంతాలను ముంచెత్తిన వరద

అడయార్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు మరింతగా బలపడుతున్నాయి. దీనికితోడు నైరుతి బంగాళాఖాతం, ఆగ్నేయ అరేబియా సముద్రంపై బాహ్య ఉపరితల ఆవర్తన ద్రోణి ఏర్పడింది. దీంతో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ 21 జిల్లాలకు హెచ్చరిక చేసింది. కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునెల్వేలి జిల్లాల్లో గురువారం రాత్రి నుంచి కుండపోతగా వర్షం కురిసింది. ఈశాన్య రుతుపవనాలు మరింతగా బలపడటంతో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇదిలావుండగా నైరుతి బంగాళాఖాతం, ఆగ్నేయ అరేబియా సముద్రంలో బాహ్య ఉపరితల ఆవర్తన ద్రోణి ఏర్పడివుందని దాని కారణంగా అనేక జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ముఖ్యంగా చెన్నై, తిరువళ్ళూరు, కాంచీపురం, చెంగల్పట్టు, విలల్లుపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టణం, తంజావూరు, తిరువారూర్, పుదుక్కోట, రామనాథపురం జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. రాణిపేట, కళ్ళకుర్చి, శివగంగై, అరియలూరు, తిరుచ్చి, తెన్‌కాశి, తిరునెల్వేలి, తూత్తుక్కుడి, కన్నియాకుమారి జిల్లాలకు చెన్నై వాతావారణ కేంద్రం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.



కుమరి పర్యాటక కేంద్రంలో జలపాతాల హోరు

గురువారం రాత్రి నుంచి..

చెన్నై నగరం, పరిసర ప్రాంతాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

కన్నియాకుమారి జిల్లాలో గత నెల రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం కూడా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నాగర్‌కోయిల్‌తో పాటు అనేక గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజాజీవనానికి అంతయారం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. కన్నియాకుమారి సముద్రతీర గ్రామా ల్లో కూడా భారీ వర్షం కురవడంతో సముద్రతీర ప్రాంతం పర్యాటకుల లేక బోసిపోయింది. జిల్లాలోని పేచ్చిపారై, పెరుంజాణి, సిట్రా రు డ్యామ్ సహా కొండ ప్రాంత గ్రామాల్లో భారీ



నాగర్‌కోయిల్‌లో గొడుగులు వేసుకుని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు

వర్షం కురిసింది. పెరుంజాణి డ్యామ్ నీటిమట్టం 65.68 అడుగులకు చేరుకుంది.

భవానీ సాగర్‌కు వరద ముప్పు..

ఈరోడ్ జిల్లాలో గురువారం ఉదయం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు జరి గింది. ఈరోడ్ కార్పొరేషన్ పరిధిలో ఉద యం నుంచి వర్షపు చినుకులు ప్రారంభం కాగా, అనేక ప్రాంతాల్లో రాత్రి కూడా వర్షం కురిసింది. భవానీ సాగర్, దానిపరిసర ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. భవానీ సాగర్‌లో 27 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నెల్లై, తూత్తుకుడి జిల్లాల్లో భారీ వర్షం...

తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో కూడా శుక్రవారం భారీ వర్షం కురిసింది. నెల్లై జిల్లాలోని రాధాపురంలో గరిష్ఠంగా 19 మిల్లీమీటర్లు, అంబైలో 13 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. తూత్తుక్కుడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. తిరుచ్చెందూరులో 6 మిమీ, కులశేఖరపట్టణంలో 5 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.

టీవీకేలో కోటికి చేరిన సభ్యత్వాలు



చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విక్రవాండిలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి మహానాడు విజయవంతంగా ముగిసి నెల రోజులు కూడా పూర్తి కాకముందే ఆ పార్టీలో సభ్యత్వం ఊపందుకుంది. నిర్వాహకుల అంచనాలను పటాపంచలు చేస్తూ సభ్యత్వం కోటికి చేరుకుంది. 2026 అసెంబ్లీ ఎన్నికలపై దృష్టిసారిస్తూ టీవీకే నేత తొలి మహానాడును విక్రవాండిలో నిర్వహించి పార్టీ సిద్ధాంతాలను ప్రకటించారు. అక్టోబరు 27న మహానాడు జరిగే సమయానికి ఆ పార్టీలో సుమారు 75 లక్షలకు పైగా సభ్యత్వాలున్నాయి. మహానాడు ఏర్పాట్ల కారణంగా సభ్యత్వ నమోదును కొన్ని రోజులపాటు ఆపారు. మహానాడు ముగిసిన కొద్ది రోజుల తర్వాత మళ్ళీ ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించగా ఆ పార్టీ నేతలు కూడా ఊహించని విధంగా లక్షల సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఒకే సమయంలో లక్షలాది మంది ఆన్‌లైన్‌లో సభ్యత్వం కోసం దరఖాస్తు చేయడంతో పార్టీ యాప్ సర్వర్ స్తంభించింది. ఆ తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సర్వర్ చక్కదిద్దటంతో మళ్ళీ సభ్యత్వ ముమ్మర కార్యక్రమం ఊపందుకుంది. శుక్రవారం మధ్యాహ్నానికి టీవీకే సభ్యత్వాలు కోటికి చేరాయి. ఈ విషయమై పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటన చేస్తారని తెలుస్తోంది.

బీజేపీలో మందకొడిగా.....

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోటి మందిని చేర్చుకోవాలన్న లక్ష్యంతో బీజేపీ రాష్ట్ర శాఖ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం మందకొడిగా సాగుతోంది. దీని పట్ల ఆ పార్టీ నేతలు తీవ్ర నిరాశలో వున్నట్లు తెలిసింది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర శాఖ ఆశించిన రీతిలో ఓటు బ్యాంక్ కూడా సాధించలేకపోయింది. ఆ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 11 శాతం ఓటు బ్యాంక్ మాత్రమే పొందగలిగింది. ఆ ఊపుతోనే పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని చురుగ్గా ప్రారంభించి కోటిమందిని పార్టీలో చేర్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నిర్వాహకులను పురమాయించింది. ఇంత చేసినా అనుకున్న లక్ష్యంలో యాభై శాతం కూడా అందుకోలేకపోయినట్లు తెలిసింది. ఈ విషయం పార్టీ అధిష్టానం దృష్టి వెళ్లింది. దీంతో బీజేపీ రాష్ట్ర నాయకులను అధిష్టానం నిలదీసినట్లు సమాచారం. దేశవ్యాపంగా బీజేపీ సభ్యత్వ నమోదు కోసం నమో యాప్ ఉపయోగించి, దరఖాస్తుల్లో ఒకటిరెండు ప్రశ్నలకు పరిమితం చేస్తే, బీజేపీ రాష్ట్ర శాఖ మాత్రం 16 రకాల ప్రశ్నలను సంధించింది. దాని వల్లే పార్టీ సభ్యత్వంపై ప్రజలు ఆసక్తి చూపలేదని చెబుతున్నారు. ఈ వివరాలను తెలుసుకున్న పార్టీ నేతలు ముఖ్యమైన మూడు నాలుగు ప్రశ్నలకు బదులిస్తే సభ్యత్వం కల్పించాలని నిబంధనలను సడలించారు. ఇంత చేసినా పార్టీ సభ్యత్వం ఊపందుకోలేదు. వీటన్నింటికి తోడు బీజేపీలో చేరితే డీఎంకే ప్రభుత్వం గృహిణులకు ప్రతినెలా ఇచ్చే రూ.1000, డిగ్రీకోర్సుల్లో చేరే విద్యార్థినులకు ప్రతినెలా ఇస్తున్న రూ.1000 సాయాన్ని నిలిపివేస్తారంటూ పుకార్లు కూడా వ్యాపిస్తుండటంతో ప్రజలు బీజేపీ తీర్థం పుచ్చుకునేందుకు జంకుతున్నట్లు సమాచారం.

ప్రజా సంక్షేమంపై ధ్యాస ఏది?

● ఏ పార్టీ వచ్చినా పోలీసుల్ని తప్పుబట్టడమేనా

● హైకోర్టు ఆగ్రహం

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు ప్రజా సంక్షేమంపై ధ్యాసే లేదని, రాష్ట్రంలోని రెండు పార్టీల్లో ఎవరు అధికారంలోకి వచ్చినా పోలీసుల్నే తప్పుబట్టడం ఆనవాయితీగా మారిందని హైకోర్టు పరోక్షంగా డీఎంకే-అన్నాడీఎంకేలను దుయ్యబట్టింది.

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి

2022లో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నేతృత్వంలో సర్వసభ్యమండలి సమావేశం జరుగుతున్నప్పుడు మరో మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) తన అనుచరులతో రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో ప్రవేసి విధ్వంసానికి పాల్పడినట్లు ఆరోపణలున్న విషయం తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు అన్నాడీఎంకే కార్యాలయంలో ఓపీఎస్, ఆయన అనుచరులు చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి కీలకమైన పత్రాలను అపహరించినట్లు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ సీబీసీఐడీకి అప్పగించారు. సీబీసీఐడీ విచారణ మందకొడిగా సాగుతున్నట్లు భావించిన అన్నాడీఎంకే నేత సీవీ షణ్ముగం ఈ కేసు సీబీఐకి మార్చాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మురుగన్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు శుక్రవారం విచారణకు వచ్చింది. అన్నాడీఎంకే పార్టీ కార్యాలయంలో జరిగిన విధ్వంస కేసుకు సంబంధించి 114 దస్తావేజులను స్వాధీనం చేసుకుని సైదాపేట కోర్టులో సమర్పించినట్లు పోలీసుల తరపు న్యాయవాది తెలిపారు. అంతేకాకుండా ఈ కేసులో సుమారు 300 మంది నిందితులున్నారని, వారిలో 100 మందికి పైగా బెయిలుపై విడుదలయ్యారని, త్వరలోనే ఛార్జీషీట్ దాఖలు చేసేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారని కోర్టుకు తెలిపారు. ఆ సమయంలో ధర్మాసనం ధర్మపురి బస్సు దహనం ఘటనను ఉటంకిస్తూ వ్యవసాయ కళాశాల విద్యార్థినుల మృతి కారణమైన వారంతా ప్రస్తుతం శిక్ష తగ్గి విడుదలై త్యాగులుగా తిరుగున్నారని కటువుగా వ్యాఖ్యానించింది. ప్రస్తుతమున్న రెండు పార్టీలకు (డీఎంకే, అన్నాడీఎంకేలకు) ప్రజా సంక్షేమంపై ధ్యాసే లేదని పేర్కొంది. సొంత పార్టీపై జరిగిన దాడి కేసు విచారణ కోసం తహతహలాడుతున్నారంటూ.. 'మీ కేసులపై మాత్రమే విచారణ జరిపితే చాలా? ఇతర కేసులు అక్కర్లేదా?' అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. అంతే కాకుండా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పోలీసులను తప్పుబట్టడమే ఆనవాయితీగా ఉంటోందని, అనవసరంగా పోలీసుశాఖను తప్పుబడుతున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ఘటన జరిగి ఇప్పటికే రెండేళ్లు గడిచిందని, ఇకనైనా సీబీసీఐడీ విచారణ త్వరితగతిన పూర్తి చేసి ఛార్జీషీటు దాఖలు చేయాలని ఆదేశిస్తూ పిటిషన్ ముగిస్తున్నట్లు పేర్కొంది.



సమాచార దర్శిని

చిత్రలేఖనం, శిల్పకళలో అవార్డులు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనం, శిల్ప కళా రంగాల్లో ఉత్తమ కళాకారులు, ఉత్తమ కళా పుస్తకాలు ప్రచురించిన రచయితకు నగదు, ప్రశంసాపత్రం అంజేయనున్నట్లు కళలు, సాంస్కృతిక శాఖ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి శిల్పం, చిత్రలేఖనం వంటి కళల్లో రాణిస్తున్న పది మంది కళాకారులకు తలా రూ.10,000, ఆర్ట్ బుక్ రచయితలు 10 మందికి తలా రూ.10,000 నగదు బహుమతి అందజేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.artandculture. tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, ఇప్పటివరకు పొందిన సర్టిఫికెట్లు, ప్రచురించిన పుస్తకాలు 2 కాపీలతో కూడిన దరఖాస్తులను 'డైరెక్టర్, కళలు, సాంస్కృతిక శాఖ, తమిళ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్ తమిళ సాలై, ఎగ్మూర్, చెన్నై-600008' అనే చిరునామాకు డిసెంబరు 6వ తేదిలోగా పంపించాలి.

2.40 కోట్లతో పీహెచ్‌సీలు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం, సైదాపేట మండలాల్లో రూ.2.40 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. టి.నగర్ రాధాకృష్ణన్ వీధి, వెస్ట్ సైదాపేట కుమరన్ వీధిలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తాయని జీసీసీ తెలిపింది.

దక్షిణ రైల్వేకు మరో రెండు వందే భారత్ రైళ్లు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వేకు మరో రెండు వందే భారత్ రైళ్లు ఇచ్చేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం, రెండు వందే భారత్ రైళ్లను దక్షిణ రైల్వేకు అందించాలని పెరంబూర్‌లోని ఐసిఎఫ్‌కు రైల్వే శాఖ అనుమతులు జారీచేసింది. అధునాతన వసతులతో ఐసిఎఫ్‌లో ఇప్పటివరకు తయారైన 70 వందే భారత్ రైళ్లు దేశవ్యాప్తంగా పలు నగరాల మధ్య నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, దక్షిణ, ఉత్తర రైల్వేలకు 20 బోగీలతో కూడిన రెండు వందే భారత్ రైళ్లు తయారుచేయాలని రైల్వే శాఖ ఐసిఎఫ్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

ఏడు ప్రాంతాల్లో అగ్నిమాపక కేంద్రాలు

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడు ప్రాంతాల్లో కొత్తగా అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, కోవలం (చెంగల్పట్టు జిల్లా), పడప్పై (కాంచీపురం జిల్లా), కరుమతంపట్టి (కోయంబత్తూర్ జిల్లా), ఏరల్ (తూత్తుకుడి జిల్లా), తిరునల్వేలి కార్పొరేషన్, పుదువయల్ (శివగంగ జిల్లా), మడత్తుకుళం (తిరుప్పూర్ జిల్లా) తదితర ప్రాంతాల్లో కొత్త అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. ఈ కేంద్రాలకు అధికారి సహా 17 పోస్టులు భర్తీచేయాలని, కేంద్రానికి అవసరమైన ఉపకరణాలు కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వం జీవోలో తెలియజేసింది.

తిరుచెందూర్ తీరంలో రాత్రిపూట ఉండొద్దు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) తిరుచెందూర్ మురుగన్ ఆలయానికి వచ్చే భక్తులు సముద్ర తీరంలో ఉండవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఈ ఆలయానికి పౌర్ణమి రోజుల్లో వచ్చే భక్తులు రాత్రి పూట సముద్రతీరంలో బసచేసి మురుగన్‌ను పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అందువల్ల పౌర్ణమి రోజుల్లో వేలాది మంది భక్తులు సముద్ర తీరంలో రాత్రి బస చేస్తుంటారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలోని సముద్రం అల్లకల్లోలంగా ఉండడం, వర్షాలు కురుస్తుండడంతో, రాత్రి సమయాల్లో భక్తులు బీచ్‌లో ఉండొద్దని పోలీసులు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోండి

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని, విద్యాభివృద్ధికి మార్గనిర్దేశం చేయాలని జిల్లా ఉపాధ్యాయ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. జిల్లా ఉపాధ్యాయ విద్య, శిక్షణ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్స్, మాస్టర్ లెర్చరర్లు, లెక్చరర్లు ఒక్కొక్కరు తమ సంబంధిత జిల్లా ప్రధాన విద్యాధికారిని కలిసి, ఒక్కొక్కరు రెండు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవాలి. నెలకు రెండు సార్లు ఆ పాఠశాలను సందర్శించి, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, బోధనా విధానాలను పరిశీలించాలి. విద్యార్థులు, ఉపాధ్యాయుల వైఖరి, బోధనా సాధనాలు వినియోగించే విధానాలు తదితరాలను పర్యవేక్షించి, తమ నివేదిక పంపించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి మధుమతి ఉత్తర్వులు జారీచేశారు.

రూ.499కే 15 రకాల సరుకులు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖ ఆధ్వర్యంలో 'అముదం' సూపర్ మార్కెట్లు, రేషన్ దుకాణాల్లో దీపావళి పండు సందర్భంగా 15 రకాల సరుకులు రూ.499కి విక్రయించారు. ఈ ప్యాక్‌కు ప్రజల నుంచి విశేషాదరణ లభించింది. ప్రసుత్తం ఉత్తర చెన్నైలోని 144 అముదం దుకాణాలు, దక్షిణ చెన్నైలోని 354 దుకాణాల్లో ప్రజలు ఈ ప్యాక్ పొందవచ్చని అధికారులు తెలిపారు.

డిసెంబరు 18 వరకు నాగై-కాంగేశం నౌక నిలిపివేత

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నాగపట్టణం-శ్రీలంక కాంగేశం హార్బర్ మధ్య నడుపుతున్న ప్యాసింజర్ నౌక సేవలు ఈ నెల 19 నుంచి డిసెంబరు 18వ తేదీ వరకు నిలివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు ఇంధశ్రీ నౌకాయాన సంస్థ ప్రకటన విడుదల చేసింది.

పాంబన్ లైట్ హౌస్ సందర్శనకు అనుమతి



పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాంబన్ లైట్ హౌస్ ప్రాంతాన్ని 33 ఏళ్ల అనంతరం పర్యాటకులు సందర్శించేందుకు అనుమతించారు. 1846లో యూరోపియన్లు పాంబన్‌లో నావికాదళ లైట్ హౌస్ ఏర్పాటు చేశారు. ప్రారంభంలో, ఈ లైట్ హౌస్‌కు చేప నూనె, వెజిటబుల్ ఆయిల్ ఇంధనంగా వినియోగించారు. అనంతరం 1923లో లైట్ హౌస్ పునరుద్ధరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత లైట్ హౌస్‌లో విద్యుద్దీపాలు ఏర్పాటుచేశారు. ఈ లైట్ హౌస్‌లో 106 మెట్లు ఉన్నాయి. 100 అడుగుల ఎత్తు, శక్తివంతమైన 1,000 క్యాండిల్ పవర్ ల్యాంప్ ఉంది. దీని స్పైరల్ ల్యాంప్ 100 మీటర్ల వ్యాసార్థాన్ని ప్రకాశించేంత శక్తివంతమైనది. ఈ లైట్ హౌస్ కాంతి తీరం నుంచి 14 నాటికల్ మైళ్ల వరకు చూడొచ్చు. 1991 వరకు ప్రజలు, పర్యాటకులు లైట్ హౌస్ సంద్శనకు రుసుము వసూలు చేసేవారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య అనంతరం ఈ లైట్ హౌస్ సందర్శనకు నిషేధం విధించారు. 2021లో దేశవ్యాప్తంగా 65 లైట్ హౌస్‌లు, రాష్ట్రంలోని 11 లైట్ హౌస్‌ల సందర్శనకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఆ ప్రకారం, 2021 ఫిబ్రవరిలో రామనాథపురం జిల్లాలోని కీళక్కరై లైట్ హౌస్, గత ఏడాది కొత్తగా నిర్మించిన ధనుష్కోటి లైట్ హౌస్‌లను ప్రజల సందర్శనానికి అనుమతించారు. అదేవిధంగా, 33 ఏళ్ల అనంతరం పాంబన్ లైట్ హౌస్‌ను ప్రజలు, సందర్శకులను అనుమతిస్తున్నారు. సోమవారం మినహా ఇతర రోజుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లైట్ హౌస్ సందర్శనకు అనుమతించనున్నారు. అలాగే, పిల్లలకు రూ.5, పెద్దలకు రూ.10 ప్రవేశ రుసుము, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలకు ప్రత్యేక ఛార్జీ నిర్ణయించారు. ఈ లైట్ హౌస్ పై నుంచి సముద్రపు గాలులు, పాంబన్ రోడ్ బ్రిడ్జి, రైల్వే వంతెన, మండలం, రామేశ్వరం రామనాథస్వామి ఆలయం, సౌత్ గల్ఫ్ ఆఫ్ మన్నార్ తీరం, ఉత్తరాన పాక్ జలసంధి సముద్ర తీరం ప్రాంతం, పాంబన్, కోరి ద్వీపం, కురుసడై తదితర చిన్న ద్వీపాల సహజ సౌందర్యాన్ని సందర్శకులు ఆస్వాదించవచ్చు.

మొగప్పేర్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



పూజలు నిర్వహిస్తున్న తెలుగు సంఘం నిర్వాహకులు

ప్యారిస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా మొగప్పేర్‌లోని తెలుగు కల్చరల్ అండ్ సోషల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. మొగప్పేర్ సంతాన శ్రీనివాస పెరుమాళ్ సత్సంగ్ మండపంలో 60 మంది దంపతులతో పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి పూజతో సత్యనారాయణ వ్రతం ప్రారంభమైంది. సంఘం అధ్యక్షులు డా.గిరి హనుమంత రావు, సీనియర్లు వీవీడీ రావు, ఎస్.నిర్మల్ చందర్, టీఎంకే కుమార్, ఇతర సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించి, ముత్తయిదువులకు పసుపు కుంకుమ అందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పుళుదివాక్కం: భగత్‌సింగ్ వీధి, ముత్తు మహమ్మద్ వీధి, పుళుదివాక్కం మెయిన్ రోడ్డు, పుళుదివాక్కం సహకార కార్యాలయం, రాజేశ్వరి నగర్, చెంగల్వరాయన్ వీధి, తంగవేల్ వీధి, యూనియన్ కార్బైడ్ కాలని, సోలైప్పన్ వీధి

నుంగంబాక్కం: నుంగంబాక్కం హైరోడ్డు కొంత భాగం, కృష్ణమా రోడ్డు, ప్రగతమ్మాళ్ వీధి, కోడంబాక్కం హైరోడ్డు, వాల్స్ గార్డన్, రూత్‌లాండ్ గేట్ 1 నుంచి 4 వీధులు, కథడ్రల్ రోడ్డు, తిరువీధియాన వీధి, మోడల్ స్కూల్ రోడ్డు, అజీజ్‌ముల్క్ వీధి, నుంగంబాక్కం హైరోడ్డు 4వ లైన్, అన్నాసాలై ప్రాంతం, జీఎన్ చెట్టి రోడ్డు, హబీబుల్లా రోడ్డు, లాయిడ్స్ రోడ్డు, విద్యోదయ రోడ్డు, ప్రకాశం వీధి, జీకే పురం, తిరుమూర్తినగర్ మెయిన్ రోడ్డు, తిరుమూర్తి 1 నుంచి 6 వీధులు, సుందరం వీధి, అన్నాసాలై, కేథడ్రల్ గార్డెన్

కోయంబేడు: కోయంబేడు మార్కెట్, చిన్మయ నగర్, నెర్కుండ్రం, ఆళ్వార్ తిరునగర్ (కొంత భాగం), మూకాంబిగై నగర్, అళగమ్మాళ్ నగర్, కృష్ణా నగర్, భువనేశ్వరి నగర్, పెరుమాళ్ ఆలయ వీధి, జయలక్ష్మి నగర్, ఎన్టీ పటేల్ రోడ్డు, పల్లవన్ నగర్, చెట్టి వీధి, పీహెచ్ రోడ్డు

ఘనంగా బాలల, ఉపాధ్యాయ దినోత్సవం



విద్యార్థులు, టీచర్లతో చంద్రగిరి లత బాలాజి, మాలతి సంతోష్, భాను తదితరులు

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేటీసీటీ బాలికల పాఠశాల పూర్వ విద్యార్థినుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బాలలు, ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. సంఘ అధ్యక్షురాలు చంద్రగిరి లత నేతృత్వం వహించిన ఈ వేడుకల్లో కేటీసీటీ ప్రాథమిక, మహోన్నత పాఠశాలల విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన 10 రకాల పోటీల విజేతలకు బహుమతులు, విద్యాసామగ్రి అందజేశారు. టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ పరీక్షలు రాసే విద్యార్థులకు అల్పాహారం కోసం లత, కార్యదర్శి మాలతి, కోశాధికారి భాను రూ.7,000 విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కె.అనిల, చుక్కా రేవతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాకు భారత పౌరసత్వం కల్పించండి

● మంత్రి నాజర్‌కు లంక శరణార్థుల వినతి

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమకు భారత పౌరసత్వం కల్పించాలంటూ లంక తమిళులు ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎం.నాజర్‌కు విజ్ఞప్తి చేశారు. స్థానిక పుళల్ కావాంగరైలో ఉన్న శ్రీలంక శరణార్థుల పునరావాస కేంద్రాన్ని మంత్రి నాజర్ గురువారం పరిశీలించారు. ఈ పునరావాస కేంద్రంలో రూ.2.30 కోట్లతో నిర్మిస్తున్న వసతిగృహాన్ని ఎమ్మెల్యే సుదర్శనంతో కలసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రికి లంక శరణార్థులు తమ కోర్కెలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. తమకు భారత పౌరసత్వం కల్పించడంతో పాటు చదువుకున్న యువతకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ విభాగం గ్రీవెన్స్



ట్రాఫిక్ పోలీసుల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం ట్రాఫిక్ విభాగం గ్రీవెన్స్ జరిగింది. పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్, ప్రజలు, పోలీసుల సమస్యలు తెలుసుకొనేలా గ్రీవెన్స్ ఏర్పాటుచేసి స్వయంగా పాల్గొని వినతిపత్రాలు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ట్రాఫిక్ విభాగం గ్రీవెన్స్ జరిగింది. ఈ శిబిరంలో ట్రాఫిక్ విభాగం అధికారులు, పోలీసులు పాల్గొని బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతన సమస్యలు సహా పలు సమస్యలపై 150 వినతిపత్రాలు అందజేశారు. ఈ సమస్యలను విచారించి సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కమిషనర్ అరుణ్ ఆదేశించారు.

ఎన్నెల్సీ తొలి థర్మల్ కేంద్రం కూల్చివేత



పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నెల్సీ మొదటి థర్మల్ విద్యుత్ కేంద్రం కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. 1972లో 600 మెగావాట్ల సామర్థ్యంతో జర్మన్, రష్యా ఇంజనీర్ల పర్యవేక్షణలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలు 20 ఏళ్లకు మించి పనిచేయకూడదనే నిబంధన ఉంది. ఆ ప్రకారం, 2020లో ఈ కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, కాలం చెందిన థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూల్చివేయాలని గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది. ఆ ప్రకారం, 62 ఏళ్లుగా నైవేలీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మొదటి థర్మల్ విద్యుత్ కేంద్రం కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. కాగా, కూల్చివేత సందర్భంగా ఆ ప్రాంతాలకు ప్రజలు, ఉద్యోగులు వెళ్లకుండా నిషేధం విధించారు.

మదురై రోడ్డులో కలకలం రేపిన తల భాగం



పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మదురై పట్టణంలోని ప్రధాన రోడ్డుపై శుక్రవారం కనిపించిన తల భాగం కలకలం రేపింది. తిరుపాలై పోలీస్ స్టేషన్ సమీపంలోని రోడ్డుపై కనిపించిన తలను చూసిన ఆ ప్రాంతవాసులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని చేపట్టిన విచారణలో... నారాయణపురం ప్రాంతానికి చెందిన పేచ్చియమ్మాళ్ అనే వృద్ధురాలు బుధవారం అనారోగ్యంతో మృతిచెందిందని, ఆమెను శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించగా, సగం శరీరం మాత్రమే కాలిందని, శ్మశానవాటిక సిబ్బంది సరిగ్గా గమనించికపోవడంతో, తల భాగాన్ని వీధికుక్కలు రోడ్డుపైకి తీసుకొచ్చాయని తెలిసింది. దీంతో, ఆ తలను మళ్లీ శ్మశానవాటిక సిబ్బందికి పోలీసులు అప్పగించారు.

మార్టిన్ ఇళ్లు, కార్యాలయాల్లో కొనసాగుతున్న ఈడీ తనిఖీలు

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ లాటరీ వ్యాపారి మార్టిన్, ఆయన బంధువుల నివాసాలు, కార్యాలయాల్లో రెండో రోజైన శుక్రవారం కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. కోవైకి చెందిన పారిశ్రామికవేత్త, లాటరీ వ్యాపారి మార్టిన్ లాటరీ టిక్కెట్ల విక్రయాల్లో అవినీతికి పాల్పడి రూ.910 కోట్లకు పైగా పలు సంస్థల్లో పెట్టుబడి పెట్టినట్లు ఈడీ అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మార్టిన్‌కు సంబంధించిన రూ.450 కోట్ల స్థిరాస్తులను ఇదివరకే స్తంభింపజేశారు. ఈ నేపథ్యంలో, గత సంవత్సరం ఏప్రిల్, మే, అక్టోబరు నెలల్లో కోవై, చెన్నై తదితర ప్రాంతాల్లో ఉన్న మార్టిన్, ఆయన కుమారుడు ఛార్లెస్, అల్లుడు ఆదవ్ అర్జున్ నివాసాలు, బంధువుల ఇళ్లలో తనిఖీలు చేశారు. గురువారం మొత్తం 7 ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీలు శుక్రవారం కూడా కొనసాగాయి. కోవై తుడియలూరు సమీపంలో ఉన్న హోమియోపతి కళాశాల గదులను తనిఖీ చేశారు. అదేవిధంగా శరవణపట్టి, సాయిబాబా కాలనీలో నివశించే ముగ్గురు మార్టిన్ బంధువుల ఇళ్లలో తనిఖీలు చేపట్టి, ఆస్తులకు సంబంధించిన కొన్ని కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

కొడనాడు కేసులో ఈపీఎస్‌ను ఎందుకు ప్రశ్నించకూడదు?

● హైకోర్టు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొడనాడు హత్య, దోపిడీ కేసులో, అప్పటి ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని ఎందుకు విచారించకూడదని మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత విశ్రాంతి తీసుకొనేందుకు వెళ్లే నీలగిరి జిల్లా కొడనాడు ఎస్టేట్‌లో 2017 ఏప్రిల్ 23వ తేది ఓం బహదూర్ అనే వాచ్‌మాన్ హత్యకు గురయ్యాడు. అలాగే, ఎస్టేట్‌లో పలు పత్రాలు దోపిడీకి గురయ్యాయని సోలూర్‌మఠం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నీలగిరి సెషన్స్ కోర్టులో ప్రస్తుతం కేసు విచారణ జరుగుతోంది. ఈ కేసుకు సంబంధించి, మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి, శశికళ, ఇళవరసి, సుధాకరన్, నీలగిరి మాజీ కలెక్టర్ శంకర్, మాజీ ఎంపీ మురలి రమ్య, అన్నాడీఎంకే నేత సజీవన్, ఎస్టేట్ మేనేజర్ రాజన్, సునీల్ తదితరులను విచారించేందుకు అనుమతి కోరుతూ ఈ కేసులో నేరారోపణలు ఎదుర్కొంటున్న దీపు, సదీశన్, సంతోష్ సామి తదితరులు నీలగిరి కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన కోర్టు, ఎస్టేట్ మేనేజర్ నటరాజన్‌ను మాత్రమే విచారించేందుకు అనుమతిస్తూ, మిగిలిన వారిని విచారించాలనే పిటిషన్‌ను గత ఏప్రిల్‌లో తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ దీపు, సదీశన్, సంతోష్‌సామి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్‌లో... ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి ప్రమేయంపై సయాన్ మాట్లాడిన నేపథ్యంలో, దాని తీవ్రత పరిశీలించడంలో నీలగిరి కోర్టు విఫలమైందన్నారు. జయలలిత మృతి అనంతరం శశికళ, ఇళవరసి నియంత్రణలో కొడనాడు ఎస్టేట్ ఉందన్నారు. అందువల్ల, చోరీ సమయంలో తప్పిపోయిన వస్తువుల గురించి వారికి తెలుస్తుందని, విచారణ బృందం బహిరంగ విచారణ చేయకుండానే ప్రధాన నిందితులను వదిలేసిందని, అందువల్ల నీలగిరి కోర్టు ఉత్తర్వులు కొట్టివేసి, జాబితా నుంచి తొలగించిన వారిని విచారించేందుకు అనుమతించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి వేల్‌మురుగన్ ఈ పిటిషన్ శుక్రవారం విచారించిన సందర్భంగా ఇప్పుడు సీఎంగా లేని పళనిస్వామిని విపక్షాల సాక్షిగా ఎందుకు విచారించకూడదని ప్రశ్నిస్తూ, తేది ప్రకటించకుండా తీర్పు వాయిదావేశారు.

కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాలలో మ్యాథ్స్ ల్యాబ్



ల్యాబ్ ప్రారంభిస్తున్న గౌరవ కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్వాల్ బజార్ సమీపంలోని కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాలలో కొత్తగా ఏర్పాటుచేసిన మ్యాథ్స్ ల్యాబ్‌ను పాఠశాల గౌరవ కరస్పాండెంట్, మద్రాసు హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్ఎల్.సుదర్శనం ప్రారంభించారు. ఈ పాఠశాలలో గురువారం సాయంత్రం బాలల దినోత్సవం, పాఠశాలల శతవార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు గణిత విద్యపై సాంకేతిక పరంగా మెళుకువలు నేర్పేందుకు ఈ ల్యాబ్ ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అనిల తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఆర్.కీర్తివాసన్, ఎస్ఎల్ సుదర్శనంలను ఘనంగా సత్కరించారు.

పటిష్టమైన పోలీస్ భద్రత

● జీహెచ్ సహా ప్రధానాస్పత్రుల నిఘా



ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి కలైంజర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రుల్లో ఇటీవల వైద్యులపై జరిగిన దాడి దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో గట్టి పోలీసు భద్రత ఏర్పాటైంది. రాజధాని నగరంలోని రాజీవ్ గాంధీ స్మారక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, గిండి కలైంజర్ సూపర్ స్పెషాలిటీ ఆ్పత్రి, కీల్పాక్కం, రాయపేట, క్రోంపేట ఆసుపత్రులలో ఔట్ పేషంట్ విభాగం, రోగుల వార్డుల్లో సందర్శకులకు కట్టుబాట్లు విధించారు. రోగులను పరామర్శించేందుకు వచ్చే బంధువులు, కుటుంబ సభ్యులను ఆస్పత్రి ప్రవేశ ద్వారం వద్ద పోలీసులు, ఆసుపత్రులు సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. స్కానర్, మెటల్ డిటెక్టర్ పరికరాల ద్వారా సందర్శకుల బ్యాగులు తనిఖీచేస్తున్నారు. నగరంలో మిగతా ప్రభుత్వాసుపత్రుల్లో కూడా చికిత్స నిమిత్తం వెళ్లే బాధితుల చేతులకు బ్యాండ్లు కట్టి లోపలికి అనుమతిస్తున్నారు. మరోవైపు రోజుకు 8 గంటలు షిఫ్ట్ విధానంలో సాయుధ పోలీసులు ఆస్పత్రుల వద్ద పహరా ఉంటున్నారు. పోలీసులు నిఘా పెంచడంపై ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రి డీన్ బాలాజీ మీడియాతో మాట్లాడుతూ మెటల్ డిటెక్టర్, స్కానర్ తదితర పరికరాలు త్వరలో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందిపై దాడి ఘటనలు జరగకుండా పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. ఆస్పత్రికి ఉన్న 9 ప్రవేశ ద్వారాల వద్ద పోలీసులు, సెక్యూరిటీ గార్డులతో బందోబస్తు ఉంటుందని ఆయన తెలిపారు.

గిండి ఆస్పత్రిలో రోగి మృతి..మళ్లీ ఉద్రిక్తత

అడయార్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్సకోసం వచ్చిన ఒక యువకుడు మరణించడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఇటీవల ఈ ఆస్పత్రిలో తన తల్లికి సరిగా వైద్యం చేయడం లేదని ఓ యువకుడు వైద్యుడిపై కత్తితో దాడి చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆస్పత్రుల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పెరుంబాక్కంకు చెందిన విఘ్నేష్ (30) పిత్తాశయంలో సమస్య తలెత్తడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. గురువారం గిండీ ఆస్పత్రిలో చేరాడు. ఐసీయూలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. దీంతో రోగి బంధువులు వైద్యులు లేకపోవడం వల్లే విఘ్నేష్ మృతిచెందాడని ఆందోళనకు దిగారు.

ఎస్బీఐలో దోపిడీ యత్నం

ప్యారీస్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ వాలాజా వీధిలో ఉన్న స్టేట్ బ్యాంక్ శాఖలో తాళాలు పగులగొట్టి దోపిడీ యత్నం జరిగిందని పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం బ్యాంక్‌కు వచ్చిన సిబ్బంది, వెనుక వైపున్న గ్రిల్ గేట్ తాళం బద్దలై ఉండడం చూసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు జాగిలంతో బ్యాంక్‌కు వెళ్లిన పోలీసులు, దోపిడీకి సానుకూల పరిస్థితులు లేనందువల్ల తాళం బద్దలుకొట్టి ముఠా పరారైనట్లు అనుమానిస్తున్నారు. బ్యాంక్ ప్రాంగణంలో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా దోపిడీ ముఠా కోసం గాలిస్తున్నారు.

ఫార్మాస్యూటికల్స్ రంగం మరింత వృద్ధి సాధించాలి

అడయార్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ రంగం 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందాలని ఇండియన్ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ రాజీవ్ సింగ్ రఘువంశీ ఆకాంక్షించారు. డాక్టర్ ఎస్ఎస్‌కే మార్తాండం ధర్మనిధి స్మారక ఉపన్యాసాలు పోరూర్‌లోని శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో జరిగాయి. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొత్త ఆవిష్కరణలు, పరిశోధనల్లో జనరిక్స్ మెడిసిన్స్‌ను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు కూడా తమ పరిశోధన, వ్యవస్థాపకత పరిజ్ఞానాన్ని పెంచుకోవడం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఉమాశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.జెరాడ్ సురేష్, ఫార్మసీ విభాగం ఫ్యాకల్టీ కె.సుజాత, ఆర్థోపెడిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమంపై చిత్రలేఖన పోటీలు



చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముగప్పేర్ వేళమ్మాళ్ స్కూలులో వృద్ధులకు నివాస సదుపాయాలను కలిగించే అతుల్యా సీనియర్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధుల సంక్షేమంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 250 మందికిపైగా విద్యార్థులు పాల్గొని చిత్రకళా నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతుల్యా సీనియర్ కేర్ వ్యవస్థాపక సీఈఓ శ్రీనివాసన్ మాట్లాడుతూ వృద్ధులకు, బాలబాలికలకు మధ్య సన్నిహిత సంబంధాలు పెంపొందించడానికే ఈ చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

సముద్రం కోతను అరికట్టాలంటూ ఆందోళన

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా నెమ్మెలి పంచాయతి పరిధిలోని తీరప్రాంతాల్లో సముద్రపు కోతను అడ్డుకొనేలా సిమెంటు దిమ్మెలు పెట్టాలని కోరుతూ ఆ ప్రాంత జాలర్లు తమ కుటుంబాలతో సముద్రతీరంలో ఆందోళన చేపట్టారు. పది రోజుల్లో తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో రేషన్‌కార్డులు, ఆధార్ సహా అన్ని కార్డులు కలెక్టర్‌కు అప్పగించి, ఈసీఆర్ రోడ్డులో రాస్తారోకో చేపడతామని హెచ్చరించారు.

తీరానికి డాల్ఫిన్ కళేబరం



పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టినంబాక్కం నొచ్చికుప్పం సముద్రతీరానికి 16 అడుగుల డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. శుక్రవారం ఉదయం చేపల వేటకు వెళ్లేందుకు అక్కడకు చేరుకున్న జాలర్లు డాల్ఫిన్ కళేబరం గుర్తించి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడకు చేరుకొని ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేసి కొద్ది దూరంలో గుంత తీసి డాల్ఫిన్ కళేబరాన్ని పూడ్చివేశారు. చల్లటి ప్రదేశాల్లో మాత్రమే జీవించే రకానికి చెందిన డాల్ఫిన్ పడవలు ఢీకొనడం, మరేదైనా కారణాలతో మృతిచెంది ఉండొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

అందెల రవమిది పదములదా.. అంబరమంటిన హృదయముదా.. అంటూ సినీ కవి వర్ణించారు. ఆ విధంగా బాల్యం నుంచే భరతనాట్యంలో శిక్షణ పొంది, పలు నగరాల్లో ప్రదర్శనలిచ్చి.. భరతనాట్య కీర్తి ప్రతిష్ఠలను దేశవిదేశాల్లో ఎలుగెత్తి చాటుతున్న ప్రముఖ కళాకారిణి నిత్యా నరసింహన్. గృహిణిగా, మాతృమూర్తిగా, భరతనాట్య కళాకారిణిగా, నాట్యశిక్షకురాలిగా, నృత్యనాటక రూపశిల్పిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుప్రఖ్యాతలు సాధించిన నిత్యా నరసింహన్ విజయప్రస్థానం నేటి తరుణిలో......

- చెన్నై, ఆంధ్రజ్యోతి



చిన్నారులకు భరతనాట్య శిక్షణ ఇస్తున్న నిత్యానరసింహన్

భరతనాట్యంలో నిత్యా నూతనం

- ఇంటగెలిచి రచ్చగెలుస్తున్న నృత్యకళాకారిణి నిత్యానరసింహన్
- సన్నివేల్‌లో రోజూ ప్రదర్శనలు



భరతనాట్యం చేస్తున్న నిత్య

దక్షిణభారతదేశంలో నాట్యశాస్త్రం రచించిన భరతముని పేరుతో ఆవిర్భవించిన శాస్త్రీయ నృత్యం భరతనాట్యం. ఆ నాట్యంపై నాలుగేళ్ల ప్రాయంలోనే ఆసక్తి పెంచుకుని, బెంగళూరు, చెన్నై నగరాల్లో భరతనాట్య దిగ్గజాల వద్ద నాట్యాన్ని నేర్చుకుని, పలు నగరాల్లో భరతనాట్య ప్రదర్శనలిచ్చి ఇంటగెలిచి రచ్చగెలిచారు ప్రముఖ భరతనాట్య కళాకారిణి నిత్యా నరసింహన్. ప్రఖ్యాత నాట్యాచార్యులు సుమామణి, రుక్మిణీ విజయకుమార్, విద్యా అరసు, డాక్టర్ జీవీ గురు భరద్వాజ్, శ్వేతా ప్రచండే వంటి గురువుల దగ్గర శిష్యరికం చేసి భరతనాట్యానికి మరింత మెరుగులు దిద్దుకున్నారు.



సన్నివేల్ మేయర్ నుంచి అవార్డు అందుకుంటూ..

2017లో చెన్నై నగరం వీడి ప్రస్తుతం అమెరికాలో స్థిరనివాసమేర్పరచుకున్న నిత్య కాలిఫోర్నియా ప్రావిన్స్ సన్నివేల్ నగరంలో ప్రయుక్తి ఆర్ట్స్ పేరిట ఓ సంస్థ నెలకొల్పి అక్కడి యువతీయువకులకు, చిన్నారులకు భరతనాట్యంపై శిక్షణ ఇస్తున్నారు. ఇటీవలే సన్నివేల్ నగర మేయర్ లేరిక్ క్లెయిన్ చేతుల మీదుగా ఆ నగర మేటి నాట్యకళాకారిణిగా ప్రత్యేక అవార్డు కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా నిత్య మాట్లాడుతూ... భరతనాట్యం ద్వారా అద్భుతమైన ఓ సమాజాన్ని సృష్టించినందుకు తానెంతో గర్వపడుతున్నానన్నారు. భరతనాట్యంలో తాను రూపొందిస్తున్న కొత్త విధానాలు, పద్ధతులకు నాట్యసమాజమంతా తనకు మద్దతునివ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. భావితరాలకు భరతనాట్యాన్ని అందించడానికి అహరహం పాటుపడుతున్న తనకు ఈ అవార్డు లభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతిరోజూ, ప్రతిక్షణమూ భరతనాట్యంలో కొత్తదనాన్ని ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తుంటానని ఆమె తెలిపారు. ఇటీవల ఆమె ప్రదర్శించిన నృత్య ప్రదర్శనల్లో మాతే, పూజే, తమిళ్, ఉమా, బాలకథలు వంటి ఇతివృత్తాలే భరతనాట్యంలో ఆమె ప్రవేశపెట్టిన నూతన ఒరవడులకు సాక్ష్యం.



పర్వత శిఖరాగ్రంపై ఓ భంగిమలో..

బెంగళూరులో జన్మించిన నిత్యా నరసింహన్ ప్రాథమిక విద్యాభ్యాసం అక్కడే కొనసాగించింది. తర్వాత తిరుచ్చి ఎన్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి ఇంజనీరింగ్ పట్టా అందుకున్నారు. నాలుగేళ్ల ప్రాయం నుంచి భరతనాట్యంపై ఆసక్తి పెంచుకుని ఆ నాట్యాన్ని నేర్చుకుని ఉన్నత కళాకారిణిగా పేరుపొందారు.

విదేశాల్లో భరతనాట్య కీర్తి పతకాలను ఎగురవేయటంతోనే ఆమె సరిపెట్టుకోలేదు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను 'భారతీయ కళల సారాంశం' అనే శీర్షికపై బర్కిలీ, స్టాన్‌ఫోర్డ్

భారతీయ కళల సారాంశంపై బోధన ..

విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు బోధించారు. ప్రయుక్తి ఆర్ట్స్ తరఫున ఇంటర్‌ప్లే ఆర్ట్స్ పేరుతో సాంస్కృతికోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఆ కార్యక్రమం కోసం తొలిసారిగా భారతదేశం నుంచి సంగీత కళాకారులను రప్పించి వారి సంగీతంతోపాటు తన భరత నాట్య ప్రదర్శన కూడా చేసి విదేశీ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు. అంతే కాకుండా అక్కడి కళాకారులతో పాటు భారతీయ కళాకారులను కూడా కలుపుకుని ప్రయుక్తి సంస్థ ఆధ్వర్యంలోనే ఛాంబర్ కాన్సర్ట్ పేరుతో పలు ప్రదర్శనలను విజయవంతంగా నిర్వహించారు. వైభవ్ ఆరేకర్, విద్యాసుబ్రమణియన్, శ్రీరంజని, సంతానగోపాలన్, టీఎం కృష్ణ వంటి సంగీత దిగ్గజాలను కూడా సన్నివేల్ నగరానికి తీసుకెళ్ళి అక్కడి కళాకారులతో సంగీత నాట్య ప్రదర్శన ఇచ్చారు. వీటన్నింటికీ తోడు ఆమె ఇటీవలే అత్యుత్తమ ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా పేరు తెచ్చుకున్నారు. ఈ నెలాఖరులోగా న్యూయార్క్ నగరంలో అత్యుత్తమ ఔత్సాహిక పారిశ్రామికవేత్త అవార్డు కూడా అందుకోనున్నారు.



భరతనాట్యంలో హావభావాలు ...

తరుణి



'ఎమక్కు తొళిల్ రొమాన్స్'లో అశోక్ సెల్వన్ - అవంతిక

అశోక్ సెల్వన్ చిత్రం విడుదల వాయిదా

- మేకర్స్ వెల్లడి

చిత్రజ్యోతి

అశోక్ సెల్వన్ - అవంతిక జంటగా నటించిన తాజా చిత్రం 'ఎమక్కు తొళిల్ రొమాన్స్' విడుదల వాయిదా వేశారు. ఈ మూవీని ఈ నెల 15న విడుదల చేయనున్నట్టు ముందుగా ప్రకటించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడం, చెన్నై, కాంచీపురం, తిరువళ్ళూరు, చెంగల్పట్టు వంటి ఉత్తర తమిళనాడు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించడంతో, ఈ ప్రతికూలవాతావరణం కలెక్షన్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని భావించిన మేకర్స్ రిలీజ్ వాయిదా వేసి, విడుదల తేదీని తర్వాత వెల్లడిస్తామని ప్రకటించారు. ఇప్పటికే ఉత్తర తమిళనాడులో ఎడతెరిపిలేకుండా వానలు కురుస్తున్న విషయం తెల్సిందే. కాగా, తిరుమలై నిర్మాణంలో బాలాజీ కేశవన్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ఎంఎస్ భాస్కర్, ఊర్వశి, అళగం పెరుమాళ్, భగవతి పెరుమాళ్, విజయ్ వరదరాజ్, బడవ గోపి తదితరులు ఇతర పాత్రలను పోషించారు.



ఇళయరాజాతో వెట్రిమారన్

17న 'విడుదలై-2' ఫస్ట్ సింగిల్ రిలీజ్

జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ రూపొందిస్తున్న 'విడుదలై-2' సినిమా నుంచి తొలి సింగిల్ శనివారం విడుదల చేయనున్నట్టు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రం తొలిభాగం గత యేడాది మార్చి 31వ తేదీన విడుదలైంది. ఇపుడు రెండోభాగం శరవేగంగా రూపొందుతోంది. డిసెంబరు 20న రిలీజ్‌కానుంది. సూరి, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలను పోషించిన ఈ సినిమాలో భవానీ శ్రీ, ప్రకాష్ రాజ్, గౌతం వాసుదేవ్ మేనన్, రాజీవ్ మేనన్, చేతన్ తదితరులు నటించారు. విజయ్ సేతుపతి సరసన మంజూ వారియర్ నటించగా, ఇళయరాజా సంగీతం అందించారు. తొలి భాగం ఘన విజయం సాధించడంతో పాటు నిర్మాతలకు లాభాలు తెచ్చి పెట్టింది. రెండో భాగంపై మరింత శ్రద్ధపెట్టి రూపొందిస్తున్నారు. విడుదలకు నెల రోజుల సమయం మాత్రమే ఉండటంతో నిర్మాణ పనుసుల్లో వేగం పెంచారు. మరోవైపు ప్రచార కార్యక్రమాలను కూడా వేగవంతం చేయనున్నారు. ఇందులోభాగంగా 17వ తేదీ తొలి సింగిల్‌ను రిలీజ్ చేయనున్నారు. తొలి భాగంలోని పాటలన్నీ సూపర్ హిట్ అయిన విషయం తెల్సిందే.

స్నేహితుడి జీవితంలో జరిగినదే 'మిస్ యూ' కథ

- దర్శకుడు ఎన్.రాజశేఖర్

తన స్నేహితుడు జీవితంలో జరిగిన ఓ సంఘటనే 'మిస్ యూ' సినిమా కథ అని ఆ చిత్ర దర్శకుడు ఎన్.రాజశేఖర్ తెలిపారు. సిద్ధార్థ్, ఆషికా రంగనాథ్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని 7 మైల్స్ పర్ సెకండ్ అనే పతాకంపై సాముయేల్ మ్యాథ్యూ నిర్మించారు. ఈ నెల 29న రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాణ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేయనుంది. ఇతర పాత్రల్లో జేపీ, పొన్‌వణ్ణన్, కరుణాకరన్, నరేన్, అనుపమ కుమార్, రమ, బాలశరవణన్, లొల్లు సభ తదితరులు నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'ఇది ఒక రొమాంటిక్ ఫీల్‌గుడ్ మూవీగా రూపొందించాం. 'లవ్ యూ' కంటే 'మిస్ యూ' అనే వార్తే బాగా ఫేమస్. అందుకే టైటిల్‌గా ఎంచుకున్నాం. ఎవరైన తమ మనసుకు నచ్చిన యువతిని ప్రేమిస్తారు. కానీ, ఇందులో హీరో తనకు నచ్చని అమ్మాయిని ప్రేమిస్తాడు. ఈ ఒక్క పాయింట్ సిద్ధార్థ్‌ను బాగా ఇంప్రెస్ చేసింది. ఇది నా స్నేహితుని జీవితంలో జరిగిన సంఘటనతో ప్రేరణ పొంది స్క్రిప్టు రెడీ చేశాను. సినిమా దర్శకుడు కావాలనే లక్ష్యంతో ప్రయత్నించే ఒక యువకుడి పాత్రను సిద్ధార్థ్ పోషించారు. తెలుగులో సిద్ధార్థ్ అనేక ప్రేమ కథా చిత్రాల్లో నటించినప్పటికీ తమిళంలో ఇలాంటి రొమాంటిక్ చిత్రంలో నటించి చాలా రోజులైంది. ఆ కోణంలో చూస్తే ఈ సినిమా సిద్ధార్థ్‌కు ఒక మంచి చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.



'మిస్ యూ'లో సిద్ధార్థ్, ఆషికా రంగనాథ్



నయనతార

సినిమాల్లో హోమ్లీ టైప్.. ఇన్‌స్టాలో గ్లామర్

- నయనతార రూటే వేరు

అగ్రహీరోయిన్ నయనతార స్టార్‌డమ్ వచ్చిన తర్వాత సినిమాల్లో ఎక్స్‌పోజింగ్‌కు ఆమడదూరంలో ఉంటున్నారు. అదేసమయంలో ఇన్‌స్టా ఖాతాలో మాత్రం ఆమె గ్లామర్ ఫొటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నారు. నిజానికి నయనతార 'వల్లవన్', 'బిల్లా', 'ఆరంభం', 'గజిని', 'సత్యం' వంటి చిత్రాల్లో అందాలను ఆరబోశారు. హీరోయిన్‌గా స్టార్‌డమ్ వచ్చిన తర్వాత గ్లామర్ ఎక్స్‌పోజింగ్‌కు దూరమయ్యారు. దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో ప్రేమలో పడిన తర్వాత హోమ్లీ పాత్రలను ఎంచుకున్నారు. పెళ్ళయ్యాక కూడా ఇదే తరహా పాత్రల్లో నటిస్తున్నారు. అయితే, ఇన్‌స్టా ఖాతాలో మాత్రం ఆమె గ్లామర్ ఫొటోలను ఎప్పటికపుడు షేర్ చేస్తున్నారు. దీనిపై నెటిజన్లు, ఆమె ఫ్యాన్స్ ప్రశ్నించినప్పటికీ సమాధానం లేదు. పైగా గత నెలలో కూడా తనకిష్టమైన రెడ్ శారీలో ప్రత్యేకంగా షూట్ చేసిన గ్లామర్ ఫొటోలను అప్‌లోడ్ చేశారు. ప్రస్తుతం నయనతార ఇన్‌స్టాఖాతాకు 9.3 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.



డీన్‌షూస్ కర్మాగారానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, సంస్థ నిర్వాహకులు

అరియలూరులో రూ.1000 కోట్లతో డీన్ షూస్ ఫ్యాక్టరీ

సీఎం స్టాలిన్ శంకుస్థాపన ● 15వేల మందికి ఉపాధి

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో అరియలూరు జిల్లా సిప్కాట్ జయంకొండం ఇండస్ట్రియల్ పార్కులో తైవాన్ దేశానికి చెందిన డీన్‌షూస్ సంస్థ రూ.1000కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న పాదరక్షల కర్మాగారానికి ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా 15వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగుతుందని ఆయన ప్రకటించారు. గత జనవరిలో నగరంలో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల మహానాడులో డీన్‌షూస్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆ మేరకు ఆర్థికంగా వెనుకబడిన జిల్లాగా ఉన్న అరియలూరు జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆ సంస్థ సన్నాహాలు చేపట్టింది. శుక్రవారం ఉదయం జరిగిన ఫ్యాక్టరీకి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఎంఆర్కే పన్నీర్ సెల్వం, ఎస్ఎస్ శివశంకర్, కోవి చెళియన్, సీవీ గణేషన్, టీఆర్బీ రాజా, ఎంపీలు తొల్ తిరుమావళవన్, ఎ.రాజా, అరుణ్ నెహ్రూ, శాసనసభ్యుడు కేఎస్కే. కన్నన్, రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వి. అరుణ్‌రాయ్, తోలు ఎగుమతుల మండలి సీఈఓ ఆర్ సెల్వం, సిప్కాట్ ఎండీ డాక్టర్ కే సెంథిల్‌రాజ్, డీన్‌షూస్ ఉపాధ్యక్షులు రిచాంగ్, ఓటో యాంగ్, అరియలూరు జిల్లా కలెక్టర్ పి.రత్నసామి పాల్గొన్నారు.

రూ.87.94 కోట్ల పథకాల ప్రారంభం..

అరియలూరులో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అరియలూరు, పెరంబలూరు జిల్లాల్లో రూ.87.94 కోట్ల వ్యయంతో పూర్తయిన 507 పథకాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. అదే విధంగా ఆ రెండు జిల్లాల్లో రూ.120.04 కోట్ల వ్యయంతో చేపట్టనున్న కొత్త పథకాలకు శంకుస్థాపన చేసి, రూ.173.96 కోట్ల విలువైన సహాయాలను లబ్ధిదారులకు అందజేశారు. అరియలూరు జిల్లాలో అంగన్వాడీ భవనాలకు, ఏడు పంచాయతీల్లో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాలకు, 12 పంచాయతీల్లో గ్రామపంచాయతీ భవనాలను కూడా ఆయన ప్రారంభించారు.

తీరానికే పరిమితమైన పడవలు



తీరంలో నిలిపిన పడవలు

పెరంబూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ద్రోణి కారంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అలాగే, తీరపాంతాల్లో బలమైన గాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో, నాగపట్టణం జిల్లా వేదారణ్యం ప్రాంతంలో సముద్రపు అలలు ఎగిసిపడుతున్నాయి. ఈ కారణంగా, ఆరకాట్టుతురై, పుష్పవనం, వెల్లపాళయం సహా 10కి పైగా జాలర్ల గ్రామాలకు చెందిన సుమారు 5,000 మంది జాలర్లు చేపల వేటకు వెళ్లలేదు. అలాగే, 1,000కు పైగా ఫైబర్ పడవలను తీరంలో నిలిపారు. ప్రతిరోజు రద్దీగా కనిపించే తీరప్రాంతం జాలర్లు చేపల వేటకు వెళ్లకపోవడంతో నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది.

మియాట్‌లో 'రోబోటిక్ సర్జరీ ఇనిస్టిట్యూట్'

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాపురంలో వున్న మియాట్ ఇంటర్నేషనల్ ఆస్పత్రిలో 'రోబోటిక్ సర్జరీ ఇనిస్టిట్యూట్' ఏర్పాటైంది. దీనిని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం శుక్రవారం ప్రారంభించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ పృథ్వి మోహన్‌దాస్ ఆయనకు రోబోటిక్ ఇనిస్టిట్యూట్ విశేషాలను, రోబోల పని తీ రు వివరించారు. రోగులకు మియాట్ అందిస్తున్న సేవల ను, ఎప్పటికప్పుడు ఆధునీకరించుకుంటున్న తీరును మంత్రి ప్రశంసించారు.. అనంతరం మీడియా సమావేశంలో మియాట్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్, యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ మణికంఠన్, బారియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పెరుంగో రోబోటిక్ ఇని స్టిట్యూట్ వివరాలను వెల్లడించారు. రోబోటిక్ సర్జరీ అనేది మినిమల్లీ ఇన్వాసివ్ లేదా లాప్రోస్కోపిక్ (చిన్న కోత) శస్త్రచికిత్స అధునాతన రూపమని, దీనిలో సర్జన్లు కంప్యూటర్-నియంత్రిత రోబోట్ ఉపయోగించి శస్త్రచికిత్స నిర్వహిస్తారన్నారు. సర్జన్ రోబోటిక్ వ్యవస్థపై పూర్తి నియంత్రణ కలిగి వుంటారన్నారు. పరిసర కణజాలాలు లేదా అవయవాలకు హాని లేకుండా, ఖచ్చి త త్వాన్ని పెంచడమే కాకుండా, శస్త్రచికిత్స సమస్యలను తగ్గిస్తుందని, రోగి ఫలితాలను మెరుగుపరుస్తుందని వివరించారు. ఈ సాంకేతికత 140కి పైగా వివిధ రకాల శస్త్రచికిత్సల్లో రోగులకు అధికస్థాయి భద్రత నిర్ధారిస్తూ, మరింత ప్రభావవంతమైన శస్త్రచికిత్స అనుభవాన్ని అందిస్తుందని వారు వివరించారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణ్యం, డాక్టర్ పృథ్వి



డాక్టర్ అంజనాకు రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు

అడయార్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్)కు చెందిన డాక్టర్ అంజనాను ఐసీఎంఆర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించింది. ఎండీఆర్ఎఫ్ ప్రెసిడెంట్, డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషాలిటీ సెంటర్‌కు మేనేజింగ్ డైరెక్టరుగా వ్యవహరిస్తున్న డాక్టర్ అంజనకు బెస్ట్ ఎక్స్‌ట్రామ్యూరల్ పేపర్ విభాగంలో 'రీసెర్చ్ ఎక్సలెన్స్ రికగ్నేషన్ అవార్డు'ను డీహెచ్ఆర్-ఐసీఎంఆర్ హెల్త్ రీసెర్చ్ ఎక్సలెన్స్ సమ్మిట్ 2024లో ప్రదానం చేశారు. ఈ సదస్సును ఐసీఎంఆర్ 113వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్, ఐసీఎంఆర్ నిర్వాహకులు పాల్గొన్నారు.



కపిలతీర్థంలో వేడుకగా అన్నాభిషేకం

తిరుపతిలోని కపిలతీర్థంలో శుక్రవారం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేశారు. ఈ ఉపచారాలన్నీ అర్చకస్వాములే ఏకాంతంగా నిర్వహించడం విశేషం. భక్తులు ఎవరికీ ప్రవేశంలేదు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య భక్తులకు అన్నలింగదర్శనం కల్పించారు. రాత్రి 8 గంటల తర్వాత పుష్కరిణిలో అన్నవిగ్రహాలకు పూజలు నిర్వహించారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

అన్నాలంకారంలో వాల్మీకేశ్వరుడు

నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ పరివార దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకాధికార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మూలమూర్తి వాల్మీకేశ్వరస్వామిని దాతలు అందించిన అన్నంతో అలంకరించి అన్నాభిషేకాన్ని నిర్వహించారు. స్వామివారి సన్నిధిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అభిషేకించిన కొంత అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు. అనంతరం అరుణా నదిలో అన్నాన్ని నిమజ్జనం చేశారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత పర్యవేక్షించారు.

- నాగలాపురం, ఆంధ్రజ్యోతి







కపిలతీర్థంలోని శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు | తిరుపతి నరసింహతీర్థం రోడ్డులోని శివాలయం వద్ద..



కపిలతీర్థం జలపాతం వద్ద సందడి

సందడిగా కపిలతీర్థం



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని కపిలతీర్థం సందడిగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. కపిలతీర్థం కూడలి వద్ద పోలీసులు భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాహనాలు ఆపుతూ రోడ్డు దాటించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్టాండు నుంచి వచ్చే వాహనాలను ప్రకాశం పార్కు నుంచి రుయాస్పత్రి మీదుగా దారి మళ్లించారు. సాయంత్రం ఇక్కడితో పాటు శివాలయాల్లో కార్తీక దీపాలు వెలగించారు.

- తిరుపతి(కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి



పుష్కరిణిలో భక్తుల సెల్ఫీ



కార్తీకదీపం వెలిగిస్తూ..

యోగుల కొండపై..

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వడమాలపేట మండలం యోగుల కొండపై కొప్పెర దీపాన్ని వెలిగించారు. 1503 కిలోల నెయ్యితో, ఆరు అడుగుల కొప్పెర దీపాన్ని ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి వెలిగించారు. దీప దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి





తిరుమలలో కార్తీక దీప వెలుగులు

తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంతం శుక్రవారం కార్తీక దీప వెలుగులను సంతరించుకుంది. గరుడ వాహనసేవను కూడా నిర్వహించిన క్రమంలో తిరుపతి, తిరుమల స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అఖిలాండం వద్ద నేతి దీపాలను వెలిగించి పూజలు చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నాయుడుపేట వద్ద స్వర్ణముఖినది వద్ద..







శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలో..., శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖి నదిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

స్వర్ణముఖి నదిలో కార్తీక దీపాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ముక్కంటి ఆలయ రెండో గేటు వద్ద భక్తులు పెద్దసంఖ్యలో నేతి దీపాలను వెలిగించి ముక్కంటికి అర్పించారు. పుణ్య స్వర్ణముఖి నదిలో దీపాలు వెలిగించి గంగాదేవికి సమర్పించారు. ముక్కంటి ఆలయ పరిసరాలు, స్వర్ణముఖినదీ తీరప్రాంతం ఎటు చూసినా నేతి దీపపు కాంతులతో ఆధ్యాత్మిక ప్రకాశించింది. శుక్రవారం సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకుంటున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

22 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్టు



అలిపిరి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో శుక్రవారం వేర్వేరుగా చోట్ల 49 కిలోల గంజాయి పట్టుకున్నారు. నగర పరిధిలోని ఆటోనగర్‌లో అలిపిరి పోలీసులు 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. నగర డీఎస్పీ వెంకటనారాయణ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం గాజులపల్లికి చెందిన మాదరపు మాధవ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన తోటి సందీప్‌తో కలిసి తిరుపతిలోని అలిపిరి, ఆటోనగర్‌ను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆటోనగర్ బస్టాప్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా రహస్య సమాచారం మేరకు అలిపిరి సీఐ రాంకిషోర్ సిబ్బందితో కలసి వెళ్లి పట్టుకున్నారు. మాధవ నుంచి 12 కిలోలు, సందీప్ నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని, ఆటోను సీజ్ చేశారు. గంజాయి ఎక్కడి నుంచి తెస్తున్నారు? ఎవరు సరఫరా చేస్తున్నారనే వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీఎస్పీ చెప్పారు.

నాగలాపురంలో 12 కిలోల పట్టివేత

- ముగ్గురు తమిళనాడువాసులకు రిమాండ్?

నాగలాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ముగ్గురు తమిళనాడువాసులను రిమాండుకు తరలించినట్లు సమాచారం. శుక్రవారం నాగలాపురం బైపాస్ రోడ్డులో పోలీసులు నిర్వహించిన నాకాబందీలో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు తమిళనాడుకి చెందిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరి నుంచి 12 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను సత్యవేడు కోర్టుకి తరలించి రిమాండ్‌కి తరలించినట్లు సమాచారం. దీనిపై పోలీసులు సాయంత్రం 3 గంటలకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. అయితే సమావేశం రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నిందితుల వివరాలను తెలుసుకునేందుకు ఎస్ఐ సునీల్‌కుమార్‌ను సంప్రదించగా, ఆయన నిరాకరించారు.





తిరుపతి రైల్వే స్టేషన్‌లో బ్యాగులు తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు, గంజాయి బ్యాగులను స్వాధీనం

రైల్వే స్టేషనులో 15.124 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం/సెంట్రల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలు నిర్వహించిన ఆపరేషన్ నార్కోస్ సక్సెస్ అయింది. స్టేషన్‌లోని లగేజీ కౌంటర్లు, పార్సిల్ కార్యాలయాలు, వివిధ రైళ్లు, ప్లాట్‌ఫారాలపై ఏకకాలంలో తనిఖీలు చేపట్టి రూ.3.78 లక్షల విలువ చేసే 15.124 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి స్టేషన్ నుంచి గంజాయి తరలిపోతుందనే సమాచారంతో జీఆర్‌పీఎఫ్ సీఐ ఆశీర్వాదం, ఎస్ఐలు ధర్మేంద్ర, రాంబాబు, ఏఎస్ఐ మునిరాజ, డాగ్ హ్యాండ్లర్ యానాదిరావు సిబ్బందితో కలసి ఐదారు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. నాలుగో ప్లాట్‌ఫారం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వదలి వెళ్లిన ట్రాలీ, కళాశాల బ్యాగుల్లో గంజాయిని ఆర్‌పీఎఫ్‌కు చెందిన జాగిలం వాయు గుర్తించింది. 15.124 కిలోల గంజాయిని సీఆర్‌పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. గంజాయి, నిషేధిత వస్తువులు కనిపిస్తే వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ఆశీర్వాదం కోరారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తనిఖీల్లో పాల్గొన్నారు.

18 నుంచి రేణిగుంట మీదుగా శబరిమలైకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు15 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాదు, మచిలీపట్నం నుంచి కొల్లం మధ్య శబరిమలైకి ఈనెల 18 నుంచి నాలుగు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

- మచిలీపట్నంలో ఈనెల 18, 25 తేదీల్లో ప్రత్యేక రైళ్లు(07145-07146) మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి న్యూగుంటూరు, తెనాలి, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, కోయంబత్తూరు, పాల్‌కాడ్ మీదుగా మరుసటి రోజు రాత్రి 9.20 గంటలకు కొల్లంకు చేరుకుంటాయన్నారు. కొల్లంలో ఈనెల 20, 27 తేదీల్లో తెల్లవారుజాము 2.30 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో మరుసటి రోజు ఉదయం 7 గంటలకు మచిలీపట్నం చేరుకుంటాయని వివరించారు.
- ఈనెల 22, 29 తేదీలలో ప్రత్యేక రైళ్లు (07143, 07144) మౌలాలిలో ఉదయం 11.30 గంటలకు బయలుదేరి చర్లపల్లి, జనగామ్, మహబూబాబాద్, డోర్నకల్లు, ఖమ్మం, విజయవాడ, తెనాలి, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, తిరుపూరు, కోయంబత్తూరు, త్రిసూర్, అలువ, ఎర్నాకులంటౌన్, ఎట్టుమనూర్, కొట్టాయం, చెంగనచ్చేరి, తిరువళ్ల, చెంగనూరుల మీదుగా కయన్‌కుళ్లంకు మరుసటి రోజు రాత్రి 7 గంటలకు చేరుకుంటాయి. తిరిగి ఈనెల 24, డిసెంబరు ఒకటో తేదీ కొల్లంలో అర్ధ రాత్రి 2.30 గంటలకు బయలుదేరి ఇవే మార్గంలోనే వస్తాయి.

ప్రాణదానం ట్రస్టుకు రూ.50 లక్షల విరాళం



దాత తరపున విరాళం చెక్కును టీటీడీ అదనపు ఈవోకు అందజేస్తున్న సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు శుక్రవారం రూ.50 లక్షలు విరాళంగా అందింది. బెంగళూరుకు చెందిన బీఎంకె నగేష్ ఈ విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేయించారు. ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

శ్రీవారికి కానుకగా 15 ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు



ద్విచక్ర వాహనాల తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేస్తున్న దాత వెంకటనాగరాజ

తిరుమల, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం 15 ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు విరాళంగా అందాయి. హైదరాబాదుకు చెందిన పెరల్ మినరల్స్ అండ్ మైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సి.వెంకట నాగరాజ ఈ 15 టీవీఎస్ ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను అందజేశారు. ముందుగా వీటికి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనాలకు తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దాత అందజేవారు. ఈ వాహనాల మొత్తం విలువ రూ.22 లక్షలు అని దాత వెల్లడించారు.

నాటు బాంబులు విసిరిన కేసులో నిందితుడి అరెస్టు

తడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీసులపైకి నాటు బాంబులు విసిరిన కేసులో తప్పించు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలో పాత కేసుల్లో కొందరు నిందితులు ఉన్న కొందరు తడ శివాలయం వెనుక వైపు ఉన్న ఓ ఇంట్లో తలదాచుకున్నట్లు తెలుసుకున్న మధురావాయిల్ పోలీసులు 2021 ఏప్రిల్ 27వ తేదీన ఆ ఇంటిని చుట్టుముట్టారు. ఈ సమయంలో 9 మంది నిందితులు తమిళనాడు పోలీసులపైకి నాటుబాంబులు విసిరేసి పరారయ్యారు. ఈ కేసుకు సంబంధించి కొంతమందిని అప్పట్లోనే పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని మాధవరానికి చెందిన వర్గీస్ జోసెఫ్ తప్పించు తిరుగుతుండగా శుక్రవారం ఉదయం తడ రైల్వేస్టేషన్ వద్ద అతడిని పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు మీడియాకు వెల్లడించారు. నిందితుడిని కోర్టులోని హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో గూడూరు సబ్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.